www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 మార్చి 2023



వీరవాసరం పోలీస్‌స్టేషన్లో ఐజి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వీరవాసరం

ఐజి జి.పాలరాజు వీరవాసరం పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ రమేష్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు, క్రైం పర్సంటేజీ, రికవరీ వంటి అంశాలను ఐజి పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌పి రవిప్రకాష్, ఎఎస్‌పి సుబ్బరాజు, డిఎస్‌పి శ్రీనాథ్, సిఐ నాగప్రసాద్ ఉన్నారు.



వీరవాసరం స్టేషన్ సందర్శించిన ఐజి పాలరాజు

బృహత్తరం.. అభ్యంతరం..!

జోన్ల కేటాయింపుపై వందల్లో ఫిర్యాదులు

ఇప్పటి వరకు అధికారులకు 700 ఫిర్యాదులు

పలుకుబడితో మాస్టర్ ప్లాన్‌లో మార్పులంటూ ఆరోపణలు

సమస్యలు పరిష్కరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణ బృహత్తర ప్రణాళిక ప్రజల్లో తీవ్ర అలజడి సృష్టించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు భిన్నంగా రూపొందించారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆందోళన చెందిన పలువురు పెద్దసంఖ్యలో అధికారులకు ఫిర్యాదులు అందించారు. సుమారు 700 ఫిర్యాదులు అందినట్లు అధికారులు చెబుతున్నారు. కొంతమంది పలుకుబడి ఉపయోగించి మాస్టర్ ప్లాన్‌ను మార్చారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ సమస్యలు పరిష్కరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బృహత్తర ప్రణాళిక తీవ్ర అభ్యంతరాల నడుమ కొట్టుమిట్టాడుతోంది.

దాదాపు 36 ఏళ్ల తర్వాత భీమవరానికి అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌పై పట్టణ ప్రజల నుంచి భారీగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ డ్రాఫ్ట్‌ను ఫిబ్రవరి 21న ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 23 వరకు గడువిచ్చారు. మొదట్లో పెద్దగా అభ్యంతరాలు రాలేదు. అయితే ఆ తర్వాత ఫిర్యాదులు కోకొల్లలుగా వచ్చి పడ్డాయి. అభ్యంతరాల గడువు ముగిసేసరికి 700కుపైగా ఫిర్యాదులు అందాయని అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య పెరిగినా ఆశ్చర్యం లేదంటున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో, మరికొంత మంది నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ డ్రాఫ్ట్‌పై స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్‌పై ఫిర్యాదులు

వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్లపై భారీగా ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు పార్కు జోన్‌లు తొలగించాలని, మాస్టర్ ప్లాన్ రోడ్లపై, రిక్రియేషన్ జోన్స్‌పై భారీగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ జోన్లను మార్పు చేయాలని కోరుతున్నారు. కొన్నిచోట్ల జోన్ల కేటాయింపుపై అభ్యంతరాలు పెరిగిపోతున్నాయి. పంచాయతీగా ఉన్నప్పుడు అక్కడి అధికారుల అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణం చేసుకున్నామని, ఇప్పుడు ఆ ప్రాంతాలను పట్టణంలో విలీనం చేసి వేరే జోన్లుగా మార్చడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారులను అభివృద్ధి చేయకుండా, విస్తరించకుండా స్వప్రయోజనాల కోసం కొన్నిచోట్ల రహదారుల విస్తరణకు ప్రతిపాదించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై ఇప్పటికే అభ్యంతరాలు పెరగడంతో ఉన్నతాధికారులు మున్సిపల్ అధికారులను పిలిపించుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. చాలా ప్రాంతాల్లో నివాసాలు రాగా ఆ ప్రాంతాలను నివాసానికి కాకుండా ఇతరత్రా జోన్లుగా కేటాయించారనే విమర్శిస్తున్నారు. విలీన గ్రామాల్లో సక్రమంగా చేయలేదనే ఆరోపణలున్నాయి. ఇదే సందర్భంలో బిజెపి రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణ, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాస్టర్ ప్లాన్‌పై ఫిర్యాదు చేశారు. భారీగా అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభ్యంతరాలపై



వివరణ ఇవ్వాల్సి ఉందని చెప్పడం విశేషం. టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం తమకు వచ్చిన అభ్యంతరాలకు సంబంధించి దరఖాస్తులను ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపిస్తామని, వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తాము పరిశీలించి నివేదిక అందిస్తామని చెబుతున్నారు. ఫిర్యాదులపై అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోతే మాస్టర్ ప్లాన్‌పై కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నామని కొంతమంది స్పష్టం చేశారు.

ఎట్టకేలకు కొత్త ప్రణాళిక

భీమవరం పట్టణానికి మొదటి ప్రణాళిక 1987లో ఇవ్వగా అది 2007లో ముగిసింది. ఇప్పుడు కొత్తగా బృహత్తర ప్రణాళిక ముస్తాయిదాను రూపొందించారు. జిల్లా కేంద్రం కూడా కావడంతో నూతన ప్రణాళిక తప్పనిసరైంది. దీనిలో వాణిజ్యం, నివాస ప్రాంతాలు, సమ్మిళితం, పారిశ్రామికం ఇలా వివిధ రకాలుగా విభజించారు. కొత్త ప్రణాళికలో 40 అడుగుల రోడ్లు ఎక్కువగా చూపారు. కొన్నిచోట్ల 60, 80 అడుగుల రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం 25.64 చదరపు కిలోమీటర్లు. విలీనమవుతున్న రాయలం, కొవ్వాడ అన్నవరం, తాడేరు, చినఅమిరం గ్రామాలను కలిపి డ్రాఫ్ట్ రూపొందించారు. దీంతో పట్టణ విస్తీర్ణం 45,899 చదరపు కిలోమీటర్లు కానుంది. చినఅమిరం గ్రామాన్ని పట్టణంలో విలీనం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అక్కడి ప్రజలు కోర్టుకెళ్లారు.

జోన్ల వ్యవస్థ అత్యంత దారుణం

'జోన్ల వ్యవస్థను అస్తవ్యస్తంగా రూపొందించారు. ఇళ్ల మీదుగా రహదారులను ప్రతిపాదించారు. మా సొంత భూముల్లో మా పూర్వీకుల కాలం నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాం. రహదారుల పేరిట ఇళ్లన్నీ తొలగిస్తే ఇక ఊరేం మిగులుతుంది. ప్రధాన రహదారి విస్తరణగా చూపారు. దీంతో వందేళ్ల చరిత్ర ఉన్న శివాలయం, సొంత భూముల్లో నిర్మించిన ధనికొండమ్మ ఆలయం కనిపించకుండాపోతాయి. ముఖ్యంగా జోన్ల వ్యవస్థ అత్యంత దారుణంగా ఉంది. ఇదెక్కడి న్యాయం' అని చినఅమిరం గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

కొన్ని ప్రాంతాల్లో కక్షలు, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రణాళికలో మార్పులు చేశారని ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి అంశాలను కొందరు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పురపాలక అధికారులను రాజధానికి పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. స్వప్రయోజనాల కోసం కొన్నిచోట్ల రహదారులను భారీగా విస్తరించనున్నట్లు ప్రణాళికలో చూపారని మరికొందరు పేర్కొంటున్నారు.

ప్రధాన అభ్యంతరాలు ఇవే

భీమవరం బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న భూములను మిక్స్‌డ్ జోన్లుగా చూపారు. అంటే అక్కడ ప్రస్తుతం దుకాణాలు, ఇళ్లు వంటివి ఉన్నట్లు చూపారు. అయితే వాస్తవానికి అక్కడ ప్రస్తుతం 98 శాతం పంట భూములున్నాయి.

భీమవరం పట్టణం, మండల పరిధిలోని మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 80 అడుగుల రోడ్డును వేరేచోటకు మార్చేశారు. ఆలయాలు, శ్మశానవాటికలను ఎక్కడా సరిగా చూపలేదు.

భీమవరం బస్టాండ్ సమీపంలో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు గతంలో 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. లీజుకి తీసుకున్నారు. ఆ గడువు ముగిసే సమయం దగ్గర పడగా దాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. అయితే మాస్టర్‌ప్లాన్‌లో దాన్ని ప్రయివేటు భూమిగా చూపడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ నడుస్తోంది.

చినఅమిరంలో అనాకోడేరు పంట కాలువకు పడమట వైపున పూర్వపు ప్లాన్‌లో 100 అడుగుల రహదారి ఉంది. దాన్ని ఇప్పుడు కాలువకు తూర్పువైపునకు మార్చారు. ఆవాస ప్రాంతం దాటాక మళ్లీ పాత ప్లాన్ ప్రకారం రోడ్డు చూపారు. కొంతమంది పెద్దలు ఈ విషయంలో పలుకుబడి ఉపయోగించారని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు.

8 ఎకరాలకు సంబంధించి 60 ఫిర్యాదులు

చినఅమిరం నుంచి రాయలం వెళ్లే రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో మార్పు జరిగిందని ప్రధాన ఆరోపణ విన్పిస్తోంది. రోడ్డు వెళ్లిన ఎనిమిది ఎకరాలకు సంబంధించిన సమస్యపై సుమారు 60 ఫిర్యాదులు అధికారులకు అందాయి. ఒక విద్యాసంస్థతోపాటు బడా భూయజమానులు తమ పలుకుబడిని ఉపయోగించి మాస్టర్ ప్లాన్‌లో మార్పు చేశారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రణాళిక రూపొందించడం వెనుక కొంతమంది రాజకీయ పెద్దల హస్తం కూడా ఉందనే ప్రధాన ఆరోపణ విన్పిస్తోంది.



నారాయణస్వామి భౌతికకాయంపై టిడిపి జెండా కప్పి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ, నేతలు

యర్రాకు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఉండి

జిల్లాలో విభిన్న రంగాల్లో తనదైన శైలిలో గొప్పముద్ర వేసిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి అంత్యక్రియలను గురువారం ఆయన స్వగ్రామం ఉండి మండలం ఉప్పులూరులో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. తొలుత ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హాజరై యర్రా నారాయణస్వామికి నివాళులర్పించారు. అనంతరం కొట్టు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నారాయణస్వామి ప్రతిఒక్కరితో ఎంతో ఆప్యాయంగా మెలిగేవారన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రతిపక్షాలతో హుందాగా ప్రవర్తించేవారని, అటువంటి వ్యక్తి మరణం తీరనిలోటు అని అన్నారు. ఆయన కుమారులు నవీన్, సూర్యచంద్రరావుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు ఆధ్వర్యంలో నారాయణస్వామి భౌతికకాయంపై జాతీయ జెండాను ఉంచి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎఆర్ బెటాలియన్ గాల్లోకి మూడు రౌండ్లు కాల్చి గౌరవ వందనం సమర్పించారు. రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలొచ్చి తమ అభిమాన నేతకు కడసారి వీడ్కోలు పలికారు.



నివాళులర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నారాయణస్వామి పేరిట రైతు సంక్షేమ పథకం
టిడిపి నేతలు వెల్లడి

తాము అధికారంలోకొచ్చాక రైతులకు అందించే సంక్షేమ పథకాల్లో ఒక దానికి మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి పేరు పెడతామని మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం ఉప్పులూరులో యర్రా నారాయణస్వామి భౌతికకాయంపై టిడిపి జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుల్లారావు, చినరాజప్పతోపాటు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి నారాయణస్వామి అందించిన సేవలు ఎనలేనివన్నారు. 2024లో తమ ప్రభుత్వం ఏర్పడుతుందని, రైతాంగానికి మేలు చేకూర్చే ఒక పథకానికి నారాయణస్వామి పేరు పెడతామని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పమన్నారని తెలిపారు.

నివాళులర్పించిన సిపిఎం నేతలు

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, నేతలు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, రంగారావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ నారాయణస్వామి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరితో ఎంతో ఆప్యాయంగా మెలిగే వారన్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

నారాయణస్వామికి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, మాజీ ఎంఎల్‌ఎలు వి.శివరామరాజు, చింతమనేని ప్రభాకర్, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, పుప్పాల వాసుబాబు, ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, మాజీ మంత్రి, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి సీనియర్ నేత మెంటే పార్థసారథి, పాతపాటి వాసు, అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి నివాళులర్పించారు.

యర్రా మృతి రైతాంగానికి తీరని లోటు
రైతు కార్యాచరణ సమితి నేత మంతెన రవివర్మ

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతి రైతాంగానికి తీరని లోటని రైతు కార్యాచరణ సమితి నేత మంతెన రవివర్మ అన్నారు. నారాయణస్వామి భౌతికకాయానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ జమిందారీ కుటుంబంలో జన్మించిన నారాయణస్వామి అన్నదాతల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేశారన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం, కొవ్వాడ రిజర్వాయర్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన వెంట నేతలు అడ్డాల వాసుదేవరావు, తమ్మినీడి నాగేశ్వరరావు, గోపిశెట్టి మురళీకృష్ణారావు ఉన్నారు.



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ఘోరం..!

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ
భార్యా భర్త, మేనల్లుడు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన రవి, బెంజిమెన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లారీ మోటారు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదలో ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం శివార్లలో సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం కృష్ణారం గ్రామానికి చెందిన నక్క రవి (30), ఉష (27) దంపతులు తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో ఉంటున్న రవి సోదరి వేల్పుల కళావతి ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లారు. వీరు గురువారం గోకవరం నుండి సత్తుపల్లి తిరుగు ప్రయాణమయ్యారు. రవి, ఉష దంపతులు ద్విచక్రవాహనంపై బయల్దేరగా, సోదరి వేల్పుల కళావతి,



రవి, ఉష దంపతులు (ఫైల్‌ఫొటో)



బెంజిమెన్ (ఫైల్‌ఫొటో)

అనంతకుమార్ దంపతులు, వారి ఇద్దరు కుమారులు జోసఫ్ బెంజిమెన్ (12), జాయ్‌బాబు బస్సులో బయల్దేరారు. వీరు జంగారెడ్డిగూడెం బస్టాండ్‌కు వచ్చేసరికి అనంతకుమార్ పెద్దకుమారుడు జోసఫ్ బెంజిమెన్ తన మేనమామ రవితో కలిసి మోటారు సైకిల్‌పై వస్తానని మారం చేశాడు. దీంతో రవి, ఉష దంపతులతోపాటు బెంజ్‌మెన్‌ను తమ మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ జంగారెడ్డిగూడెం శివారు జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని మరో లారీ ఓవర్‌టేక్ చేయబోతూ వీరి మీదకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో వాహనంపై నుంచి ఎగిరిపడ్డ రవి, జోసఫ్ బెంజిమెన్ తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాల పాలైన ఉషను స్థానికులు హుటాహుటీన 108 వాహనంపై జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే వెనుక బస్సులో వస్తున్న బెంజిమెన్ తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు, రవి మృతి చెందారని తీవ్ర షాక్‌కు గురయ్యారు. బెంజిమెన్ తల్లి కళావతి మతిస్థిమితం కోల్పోయి 'నా కొడుకు బెంజిమెన్ స్కూల్‌కు వెళ్లాలి.. ఆడుకునే టైమ్ అయ్యింది' అంటూ మాట్లాడటం అందరినీ కలిచి వేసింది. ఆమె ఆర్తనాదాలు విని అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

వ్యవసాయ రంగాభివృద్ధి వ్యవసాయ కార్మికుల అభివృద్ధితో ముడిపడి ఉందని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం 29వ మహాసభ గత డిసెంబర్‌లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, మహాసభ పిలుపులు తదితర అంశాలతో ప్రచురించిన సావనీర్‌ను స్థానిక అన్నే భవనంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 65 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ధాన్యాగారంగా పేరొందిన గోదావరి జిల్లాల్లో వ్యవసాయ కార్మికులు రోజురోజుకీ పెరుగుతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు వేతనాలు పెంచాలని దశాబ్దాలుగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాడి కనీస వేతనాలను సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో పనులు తగ్గడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పనులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించడంతోపాటు కనీస పని దినాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. యంత్రాలతో పని చేయించడం వల్ల కాంట్రాక్టర్ జేబులు నింపడం తప్ప ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అందడం లేదని మండిపడ్డారు. వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలు, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాబోయే కాలంలో ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు, నేతలు మావూరి శ్రీనివాస్, జె.మహేష్, పి.ఆనందరావు, సునీల్, నాగేంద్ర, జాన్‌రాజు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న సాబ్జీ, వ్యకాస నేతలు

మాటల్లో కాదు ఆచరణలో ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పట్టణాల అభివృద్ధి మాటల్లో కాదు ఆచరణలో ఉండాలని, పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ భీమవరంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. అండర్ పాస్ దగ్గరలో ఫుడ్ కోర్టు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. డీమార్ట్ ఎదురుగా ఆక్రమణలు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించి అధికార్లకు దిశా నిర్దేశం చేశారు. సోమగుండం చెరువు, ఎడ్వర్డ్ ట్యాంకు సుందరీకరణ పనుల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు, ప్రజల ప్రయాణానికి ఎటువంటి అడ్డంకులు, ఆక్రమణలు ఉన్నా తొలగించేదుకు రాజీ పడొద్దని ఆదేశించారు. ప్రజోపకరమైన పనుల్లో నిర్లక్ష్య ధోరణి సరికాదని హితవు పలికారు. రోడ్డు మార్జిన్లలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. జిల్లా కలెక్టరు వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డిఇఇ టివి.నారాయణరావు, టిపిఒ సీతారామయ్య, ఎఇలు వై.శ్రీనివాస్, డి.రవితేజ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

టెండర్ విధానం రద్దు కోరుతూ


దున్నపోతుకు వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్ హమాలీ కార్మికులకు టెండర్ విధానంపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో గురువారం కార్మికులు వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ, కార్యదర్శి గాది త్రిమూర్తులు మాట్లాడుతూ పెద్దలందరూ తన నోటి వద్ద కూడు లాక్కోవడం అన్యాయమన్నారు. లేని రాజకీయాలు ఆపాదించి కక్ష గట్టడం సిగ్గు చేటన్నారు. ఓపిక ఉన్నంత వరకూ న్యాయం కోసం పోరాటం చేస్తామని, అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, రాంబాబు, అప్పన్న, సాంబశివరావు, నూకరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి పారుపల్లి విసురత్నం

ప్రగతి పథంలో మృత్యుంజయ సొసైటీ

సొసైటీ ఛైర్ పర్సన్ వైట్ల శారదాదేవి

ప్రజాశక్తి - ఆచంట

మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘం లాభాలు ఆర్జిస్తూ ప్రగతి పథంలో ముందుకెళ్తున్నట్లు సొసైటీ చైర్‌పర్సన్ వైట్ల శారదాదేవి తెలిపారు. గురువారం సొసైటీ ఆవరణలో జరిగిన మహాజన సభకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సొసైటీ సేవలను మరింత విస్తృత పర్చి రెండితల రుణాలు అందిస్తున్నామన్నారు. సొసైటీ కార్యదర్శి పారుపల్లి యేసురత్నం మాట్లాడుతూ తమ సొసైటీలో సబ్సిడీపై ఆదేశ ధరకే ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశం మేరకు నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు గిట్టుబాటు ధరతో వారి సొమ్ము ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. గతంలో రూ.12 కోట్లు ఉన్న రైతు రుణాలు ప్రస్తుతం రూ.24 కోట్లు అయ్యాయన్నారు. డిపాజిట్‌దారులు రెండు రెట్లు పెరిగారని తెలిపారు. త్వరలో సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రత్యేక స్కీమ్‌లో భాగంగా రూ.పది కోట్ల కొత్త ప్రాజెక్టు మంజూరుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సొసైటీ మెరుగైన సేవలతో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సన్ పెన్మెట్సి సత్యనారాయణ, మెండే శ్రీనివాస్, సెక్రటరీ పారుపల్లి ఏసురత్నం, సభ్యులు వైట్ల కిషోర్ కుమార్, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని రెడ్డి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆకారి రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, అల్లం భాస్కర్ రెడ్డి, వెలగల సోమారెడ్డి తదితరులు పాల్గొని శ్రీరామ నవమి సందర్భంగా పానకం పంపిణీ చేశారు.

రిటైర్డ్ స్వీపర్ మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసి రిటైర్ అయిన బంగారు లక్ష్మి (82) గురువారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, సిపిఎం మండల కార్యదర్శి కూనంపూడి సుబ్బరాజు, సివిటియు నాయకులు వాకపల్లి వెంకటరత్నం (గాంధీ), తోటి స్వీపర్లు గవరయ్య, సత్యవతి, వాకపల్లి అరుణ, లూదియమ్మ సంతాపం తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని నేడు ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటరీ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు అన్నారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదలవాడ మనోహర్, కండపల్లి శ్రీను, ఆకుమర్తి తిరుపతిరావు, కనపాల వెంకటేశ్వరరావు, సిహెచ్ కృపావరం పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళి గంగరాజ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని పేర్కొన్నారు.

150 పశువులకు టీకాలు

కాళ్ల :రైతుల పశువులకు తప్పనిసరిగా గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పెదఅమిరం గ్రామంలో 150 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, పెదఅమిరం, కోపల్లె, జక్కరం గ్రామాల వెటర్నరీ జూనియర్ అసిస్టెంట్లు సూర్యనారాయణ, బ్రహ్మేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక దుంపగడప రోడ్డులోని మల్లెలవారి వీధిలో డ్రెయినేజీ గత రెండు రోజులుగా పొంగిపొర్లుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆ ప్రాంత యువకులు వాపోయారు. డ్రెయినేజీ సమస్యతో అనేక రకాలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా పొంగుతున్న డ్రెయినేజీతో ఆ రోడ్డు పిల్ల కాలువలా మారినా అధికారులు పట్టించుకోలేదు. ఆ ప్రాంతంలోని యువకులే ముందుకు వచ్చి డ్రెయినేజీ కాలువలో చెత్త తొలగించి మరమ్మతులు చేపట్టారు. గురువారం సాయంత్రం ఆ ప్రాంతంలోని చలపతి మోహనరావు, ఒగు లోకేష్, కొండ్రోతు మోహనకృష్ణ, సప్పా వెంకటేష్ డ్రెయినేజీ కాలువలో చెత్త తొలగించి అడ్డంగా ఉన్న మట్టిని తీశారు.

డివిఎఫ్ సహకారం, అభినందన

సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన స్థానిక యువతను డివిఎఫ్ ప్రోత్సహించి సహకారం అందించింది. డ్రెయినేజీ సమస్యపై అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని పట్టణ కమిటీ సభ్యులు అన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎన్ని విజ్ఞప్తులు అందించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని డివిఎఫ్ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు, డ్రెయినేజీ బాగు చేయించాలని, లేకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని కోలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏర్పాటు, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సబ్ స్టేషన్ పరిధిలోని పాములలంక, కోలమూరు, కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ ప్రాంత ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని భీమవరం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డులోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 31వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఇ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని గరగపర్రు కోడిపందేల స్థావరంపై ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి కత్తి, రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ!

గ్రామస్తుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన డ్రెయినేజీలకు మరమ్మతులు చేయకపోవడం ఈ దుస్థితికి ప్రధాన కారణమని పలువురు విమర్శిస్తున్నారు. కొన్నిచోట్ల డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈ సమస్య చెరుకువాడ, ఎర్రనారాయణ స్వామి కాలనీ, ఎస్‌సి కాలనీ రాజ్‌గూడెం, దక్షిణపేట గుబ్బల వారివీధిలో నెలకొంది. దీనికితోడు దోమలు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు పట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.


చెరుకువాడ డ్రెయినేజీ దుస్థితి

నాలుగు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

ఎంఇఒ శారదాజ్యోత్స్న



ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నాలుగు కేంద్రాల్లో విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తారని ఎంఇఒ శారదాజ్యోత్స్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. పొలమూరు, పెనుమంట్ర, మార్టేరు ఎస్‌విజిహెచ్, మార్టేరు బసంతి దేవి బాలికల హైస్కూల్లో పరీక్షల నిర్వహణకు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు పరీక్ష రాసుకునేందుకు వీలుగా ఫర్నీచర్, తాగునీరు, టాయిలెట్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మండల పరిధిలోని 383 ప్రభుత్వ, 87 మంది ప్రయివేటు విద్యార్థులు, మార్టేరు గురుకుల పాఠశాలకు చెందిన 32 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో హెల్త్ బృందం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

54 మంది ఇన్విజిలేటర్లను నియమించాం

ఎంఇఒ రవీంద్ర



ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో ఎనిమిది హైస్కూళ్లకు గాను 920 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఇఒ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. మండలంలోని ప్రతి పాఠశాలలోనూ గత 40 రోజులుగా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విధానాన్ని అనుసరించాం. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఈ సారి స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, సెంట్ అలోషియస్ హైస్కూల్, నారాయణ హైస్కూల్, చినకాపురం జెడ్‌పి హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించాం. ఆయా కేంద్రాల్లో 920 మంది విద్యార్థులకు గాను 54 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. ప్రతి పరీక్షా కేంద్రానికీ ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంటల్ అధికారిని నియమించారు. 250 మంది విద్యార్థులు దాటిన పరీక్షా కేంద్రాలకు అదనంగా మరొకరిని నియమిస్తాం. ప్రతి కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

విద్యార్థులకు అదనపు తరగతులు

బి.సూర్యకాంతం, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఆకివీడు



ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఈ ఏడాది 73 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆకివీడు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యకాంతం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం గంట, సాయంత్రం ఒక గంట అదనపు తరగతుల నిర్వహిస్తున్నామని చెప్పారు. తాము కొంతకాలం సొంతంగా ప్రత్యేక టైం టేబుల్ తయారు చేసి తరగతులను నిర్వహించామన్నారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన 40 రోజుల ప్రణాళిక అమలు చేశామని తెలిపారు. తేదీల వారీగా సబ్జెక్టులు నిర్ణయించి ఆ మేరకు రోజువారి పరీక్షలు నిర్వహించామన్నారు. ఇంటిదగ్గర చదువుకొచ్చిన సబ్జెక్టు ఇక్కడ పరీక్ష రాయాలని, అనంతరం ఇక్కడ చదువుతారని, మళ్లీ ఇంటికి వెళ్లి అదే సబ్జెక్టు చదివి తెల్లారి పరీక్షలు రాస్తారని, ఈ విధానంలో పూర్తిగా పరీక్షలకు వారిని తయారు చేశామని తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఎన్‌వైవి.సత్యనారాయణమూర్తి, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, ఆకివీడు



ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులను పోటీ పరీక్షల తరహాలో తయారు చేశామని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ ఎన్‌వైవి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పూర్తిస్థాయి వ్యాసరచనతో పాటు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కూడా పూర్తిగా చదివించామని తెలిపారు. 40 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ప్రతి సబ్జెక్టు రోజుకు అదనంగా రెండు గంటలు చదివిస్తున్నామన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు పాఠశాల సమయం నిర్ణయించామని తెలిపారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం ఒక సబ్జెక్టు టీచర్లు ప్రత్యేకంగా ఆ రోజు పూర్తిగా వారిపై కేటాయిస్తారన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీకి సిలబస్ పూర్తి చేశామని, ఆ రోజు నుంచి సందేహాలు తీర్చడం, చదివించడం, రోజువారి పరీక్షలు నిర్వహించడం, గంటన్నర చదివించడం అరగంట పరీక్ష రాయించడం ఈ విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు.


బిసి కమ్యూనిటీ హాలు ప్రారంభం


కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట :కొడమంచిలి బండివారిపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన బిసి కమ్యూనిటీ హాల్‌ను ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా ముందుగా కొడమంచిలి బండివారిపాలెంలో సీతారాములను దర్శించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలో శంకుస్థాపన చేసి వదిలేసిన శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌ను పూర్తిచేసి ప్రారంభించామన్నారు. బిసిలకు ఎంతో చేసేశాం అంటున్నా గత పాలకులు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల నుంచి కనీసం ఏ నాయకుడు వచ్చిన, ఏ ప్రభు త్వం వచ్చినా పట్టించుకున్న దాఖ లాలు లేవన్నారు. పని త్వరగా పూర్తి అవ్వాలనే ఉద్దేశంతో నేరుగా ఎంఎల్ఎ మెటల్, కంకర, ఐరన్, సిమెంట్ బస్తాలు అందిం చడంతోపాటు సొంతంగా రూ.5 లక్షలు అందించడం అభినందనీ యమన్నారు. శెట్టిబలిజ సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొని శ్రీరంగనాథ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యాళ్లమెల్లి బేబీ రాజేష్, సొసైటీ అధ్యక్షులు సత్యనారా యణ, దేవస్థానం అధ్యక్షులు బాలనాగు నరేష్, రైతు సంఘ అధ్యక్షులు సుబ్బారావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాండ్రేగుల సత్యనారాయణ

రైతుల సంక్షేమమే లక్ష్యంగా సొసైటీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నట్లు ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ 1040 మంది సభ్యులు ఉన్న కొడమంచిలి సొసైటీ నేటికి 106 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. సొసైటీలో షేర్ ధనం రూ.40,28,372, సిసి లోన్‌లు రూ.2,28,78,277, ఎల్ఎఫ్ లోన్లు రూ.46,37,620, ఎసి లోన్లు రూ. 12,74,000, ఎల్‌టి లోన్లు రూ.72,34,259 ఇలా అనేక రుణాలు ఈ బ్యాంకు ద్వారా రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. రైతు భరోసా కేంద్రం ద్వారా సార్వాకు రూ.ఏడు కోట్లు, దాల్వాకు రూ.పది కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎరువుల అమ్మకాలు రెండు సీజన్లకు సుమారు రూ.75 లక్షలు జరిగిందిని తెలిపారు. ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో సొసైటీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. రైతుల అభివృద్ధి కోసం సిఎం జగన్ చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మన్నె సుబ్బారావు, సాక సువర్ణ రాజు, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, సొసైటీ కార్యదర్శి కాళ్లకూరి నాగేశర్వరావు, రైతులు నెక్కంటి రమణ, బాలనాగు వెంకటాచలం, తమ్మిన బాస్కరరావు, తమ్మిన చంద్రశేఖర్, పి.రంగారావు, తమ్మిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సుబ్బారావుపేట డిఎస్ చెరువు సమీపంలోని శ్రీనివాస రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి ముందు ప్రాంగణంలో రోడ్డు మీద భారీ టెంటు వేసి కళ్యాణ వేదికను ఏర్పాటు చేసి సీతారాముల వారి కళ్యాణం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఏప్రిల్ ఒకటో తేదీ శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ శానం రామకృష్ణ, సభ్యులు ఓసూరి వీర్రాజు, గాదం మురళీకృష్ణ మాట్లాడారు. జనసేన పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నాయుకులు సీతారాముల స్వామివారిని దర్శించుకున్నారు. దండగర్ర, పుల్లాయిగూడెం, మెట్టుప్పరగూడెం, మోదుగుంట గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు.

ఉండి : మండల వ్యాప్తంగా గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉండి అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు చిన్నారులతో ఏర్పాటుచేసిన కోలాట కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. పలుచోట్ల కళ్యాణం నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పెనుగొండ : మండలంలోని వడలి గ్రామంలో రామాలయం వద్ద ఉప్పలపాటి వెంకట రామారావు, సరోజని దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రామాలయం ప్రాంగణంలో సంఘం సభ్యులు అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

పాలకోడేరు : మండలంలోని కోరుకొల్లు, గొరగనమూడి, విస్సాకోడేరు, గరగపర్రు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి యాత్రికులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయా ఆలయాల వద్ద సీతారాముల కళ్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. గరగపర్రు శెట్టిబలిజ రామాలయం వద్ద ఏకాహం నిర్వహించారు. పలు ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాల్లో యాత్రికులు స్వామివార్ల తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కాళ్ల : మండలంలోని కాళ్లకూరు గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా యాత్రికులకు పానకం, ప్రసాద వితరణ చేశారు. ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామంలో ప్రతి ఇంటికి పానకం, చక్కెర పొంగలి, పులిహోర అందించినట్లు చెప్పారు. మండలంలోని పెదఅమిరం, కలవపూడి రామాలయాల్లో ఎంఎల్ఎ మంతెన రామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జువ్వలపాలెం, కలవపూడి, పలు గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు.

ఆచంట : మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నవమి సందర్భంగా పలుచోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. యాత్రికులకు పానకాలు, ప్రసాదాలు అందజేశారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, పెనుమంచిలి, భీమలాపురం, వల్లూరు, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు అయోధ్యలంక గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా అన్న సమారాధన చేశారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. మొగల్తూరులోని బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో పెంకె వారికి కాంప్లెక్స్ ఆవరణలో సీతారాముల కళ్యాణం నిర్వహించి అన్న సమారాధన చేశారు. సత్రోపాలెం, పడమటిపాలెంలో అన్న సమారాధన చేశారు.

వాది తరుపున ప్రకటన

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 107/2019

వాది:
ఆళ్ళ వెంకట రామ గంగాధరరాజా, తండ్రి: బ్రహ్మానందరావు, సా॥ తణుకు.

మరియు

ప్రతివాది:
ఉమ్మిడి సీతారామయ్య, తండ్రి: వెంకట రామన్న, సా॥ హౌస్ నెం. 501, కె.సావరం, ఉండ్రాజవరం మండలం.

పై నెంబరు దావాలో ప్రోనోటు బాకీ రాబట్టుకొనుటకు వాది మీపై దావా దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారు **ది.19-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియపరుచుకోవలెను.** లేని ఎడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
తణుకు, అడ్వకేట్, తణుకు.
29-03-23. సెల్: 77992 35999

వాది తరుపున ప్రకటన

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 60/2021

వాది:
వీరకోట బసవాపరదేశయ్య, తండ్రి: బసవా మల్లయ్య, సా॥ తణుకు.

మరియు

ప్రతివాది:
కనపర్తి సురేష్, తండ్రి: రమణ @ వెంకటేశ్వరరావు, సా॥ పాతూరు, తణుకు మండలం.

పై నెంబరు దావాలో ప్రతివాదిపై పిటీషను షెడ్యూలు ఆస్థికి రింట్ డిపాజిట్ చేయుటకు ఈ నెంబరు దావాను వాది ప్రతివాదిపై దావా దాఖలు చేయడమైనది. దావాలో ప్రతివాది వాదనలు దాఖలు చేయుటకు శ్రీ కోర్టు వారు **ది.14-04-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియపరుచుకోవలెను.** లేని ఎడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
తణుకు, అడ్వకేట్, తణుకు.
29-03-23. సెల్: 77992 35999

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తాడేపల్లిగూడెం

ఓ.పి.నెం. 3/2023

బిట్వీన్:
ప్రతాప వాసవి నారాయణి ...పిటీషనరు

మరియు

ప్రతాప బాల వెంకట సుబ్రమణ్యం ...రెస్పాండెంటు

పై నెంబరు ఓ.పి.లో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు అయిన ప్రతాప బాల వెంకట సుబ్రమణ్యం, తండ్రి: లేటు సుబ్రమణ్య శాస్త్రి, పౌరహిత్యం, డో.నెం. 3సి-17-37, క్రొత్త గంగానమ్మ గుడి వెనుక, పడమర వారి వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా అయిన వారు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున వారికి Substutite Service ద్వారా నోటీసు అమలు చేయుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున రెస్పాండెంటు **ది.20-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై వారి అభ్యంతరములు తెలియజేయగలరు.** లేని ఎడల వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

జి.కె.దుర్గాదేవి
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
29-03-23. సెల్: 99855 92776

In the Court of the Special Magistrate, Tanuku

C.C. No. 50/2021

Between:

Petitioner/ Complainant:
అవిడి మధుసూదనరావు

మరియు

Respondent/ Accused:
కామన రాధాకృష్ణ

నిందితుడి హాజరు నిమిత్తం సెక్షన్ 82సి, ఆర్.పి.సి. ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పై నంబరు గ్రంధములో ముద్దాయి కామన రాధాకృష్ణ, తండ్రి: శ్రీ రాంబాబు లోగడ డో.నెం. 5-164/1, వెంకటరామ నగర్, పైడిపర్రు, తణుకు, ప॥గో॥జిల్లా, ప్రస్తుత నివాసము: కేరాఫ్ కామన సత్యవతి, స్వాతి రెసిడెన్సీ, 5వ ఫ్లోర్, సజ్జాపురం, తణుకు, ప॥గో॥జిల్లా. మీపై ది. 26-12-2022న వారంటు జారీ కాబడినది. సదరు ఎన్.బి.డబ్ల్యు. అమలుకాక ముద్దాయి అయిన మీరు తప్పించుకొని తిరుగుచున్నందున ఫిర్యాది Crl. M.P. No. 28/23, సెక్షన్ 82 సి.ఆర్.పి.సి., ఆర్డర్ ప్రకారం ప్రొక్లమెషన్ వారంటు అనగా పేపర్‌లో పబ్లికేషన్ ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 11-4-2023వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.00లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ తాలూకు వాదన తెలియజేయవలయును. లేనిచో చట్టప్రకారం మీపై చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

E.RAMA KRISHNA, Advocate
D.No.16-6-1, Old Town
Tanuku, Cell: 9440120445

వేలం ప్రకటన

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు, ప॥గో॥జిల్లా

ఇ.పి. నెం. 89/2015 ఇన్ ఒ.ఎస్. నెం. 367/2008

మధ్య:
శ్రీ బలే రామకృష్ణ ***...DHr/DHr***

మరియు

శ్రీ బలే గంగాధరరావు (డైడ్) మరియు యితరులు ***...JDRs/ JDRs***

పై నెంబరు గ్రంధములో DHr తన బాకీని పై JDR లు వద్ద నుంచి వసూలు చేసుకొనే నిమిత్తం దాఖలు చేసిన ఈ ఇ.పి. గ్రంధములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 13-04-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగంగా వేలం వేయబడును. వేలంలో పాడుకొనదలచినవారు ఉదయం గం॥ 10.30 ని॥లకు మీ ఆధార్ కార్డులతో వచ్చి షరతుల ననుసరించి వేలంలో పాల్గొనవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు, భీమడోలు మండలం, ఆగడాలలంక గ్రామం 1వ వార్డులో ఆర్.ఎస్. నెం. 1117/2రు దాఖలా పాత డోరు నెం. 1-5-7 నకు ప్రస్తుత డోరు నెం. 2-12 గల య. 0-09ట్లు ఆస్తిలో య. 0-03ట్లు ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** పంచాయతి రోడ్డు. **దక్షిణం:** JDR ల యొక్క మిగతా స్థలంలో గల పెంకుటిల్లు డోరు నెం. 2-12 (పాత డోరు నెం. 1-5-7). **పడమర:** రోడ్డు (గుండుగొలను టు చెట్టున్నపాడు). **ఉత్తరం:** కంసాల ధనాచార్యులు గారి వారసుల ఇల్లు మరియు స్థలం.

DHr Value : Rs. 2,50,000/-

JDR Value : పేర్కొనబడలేదు.

Amin Value : Rs. 2,00,000/- (తొమ్మిది సెంట్లు ఆస్తికి దానిని అనుసరించి దామాషాగా రూ. 1,33,333/-)

నోట్:

1. షెడ్యూలు ఆస్తి మీద ఎట్టి ఎన్‌కమ్‌బెరెన్సులు లేవు.
2. వేలంలో ఆస్తిని కొనుగోలు చేయు ఆసామి వేలం అయిన వెంటనే నాల్గవ వంతు వేలపు సొమ్ము మరియు ఫౌండేజ్ ఫీజు చెల్లించవలయును.
3. మిగులు వేలపు సొమ్ము రిజిస్ట్రేషన్ ఖర్చులతో సహా సదరు వేలం తేదీ లగాయితు 15 రోజులలో చెల్లించవలయును.
4. వేలం నియమ నిబంధనలు తెలుసుకొనుటకు పై కోర్టు ఆఫీసు నందు గాని, సెంట్రల్ నజారత్ ఆఫీసు నందు గాని సంప్రదించవలయును.

(కోర్టు వారి ఉత్తర్వులననుసరించి ప్రకటన జారీ చేయడమైనది)

KURAPATI PRITHVI RAJ
ఏలూరు, Advocate, Eluru
తేది:30-3-2023 Cell: 8019826216

గ్రామపంచాయతీ కార్యాలయము, పెదఅమిరం

సీల్డు టెండరు నోటీసు

రి.క. నెం. టెండరు/2023 **తేది.29-03-2023**

ది. 04-04-2023 సంవత్సరం తేదీ మంగళవారం మధ్యాహ్నం 03.00 గం॥ల వరకు దిగువ సంతకముదారునిచే ఈ దిగువ షెడ్యూలు దాఖలా కాంట్రాక్టు పనులు, అయిటములు సరఫరా నిమిత్తము సీల్డు టెండర్లు స్వీకరించి అదే రోజు హాజరు టెండర్ల సమక్షములో టెండర్లు తెరవబడును. ధరావత్తులు చెల్లించని, అసంపూర్తి, దిద్దివేతలు, కొట్టివేతలు గల టెండర్ల టెండరు తిరస్కరించబడును. ఎట్టి కారణము చూపకనే ఏ టెండరునైనా ఆమోదించుటకు, తిరస్కరించుటకు పంచాయతి కార్యదర్శి వారికి పూర్తి అధికారములు గలవు. ఇతర వివరములు ఈ దిగువ సంతకముదారు నుండి ఈ కార్యాలయం పని వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చు.

వ.సం.	పని వివరములు	కాలపరిమితి	పనివారి వివరము	ధరావత్తు
1	ప్రజారోగ్య పనివారు ఏజెన్సీ ద్వారా	2023-24	20 మంది	10,000/-
2	నీటి సరఫరా పనివారు, ఎలక్ట్రీషియన్ పనివారు	2023-24	19 మంది	200/- చొప్పున
3	SWM షెడ్ వాచ్‌మెన్	2023-24	1	200/-
4	నీటి సరఫరా సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున
5	ప్రజారోగ్య సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున
6	విద్యుత్ అవసర విడిభాగముల సరఫరా	2023-24	--	5000/- చొప్పున
7	స్టేషనరీ సామాగ్రి సరఫరా	2023-24	--	5000/- చొప్పున

సం/- **డొక్కు సోమేశ్వరరావు**
సర్పంచ్, పెదఅమిరం,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా

సం/- **పి.కనకరావు**
గ్రామ కార్యదర్శి, పెదఅమిరం
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా